# ఫోన్ ట్యాపింగ్‌పై న్యాయ విచారణకు మేధావుల డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లలో రాజ్యాంగం ప్రకారం మానవ హక్కులు, గోప్యత, పౌరుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించి ఫోన్ ట్యాపింగ్ చేశారని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎంకు హైదరాబాద్ నగరానికి చెందిన 25 మంది సోషల్ యాక్టివిస్టులు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛను కాపాడేందుకు పోలీసింగ్ లో సంస్కరణలు తీసుకురావాలని మేధావులు కోరారు. మెదక్ లో ఇటీవల జరిగిన హింసాత్మక సంఘటనను ఫోరం ఎత్తి చూపించింది. సమాజంలో చట్టబద్ధమైన పాలన ద్వారా న్యాయం కోసం పోలీసింగ్ అవసరమని వారు పేర్కొన్నారు.

**హక్కులను హరించిన ఫోన్ ట్యాపింగ్**

గత పదేళ్లలో ప్రజల హక్కులను కాలరాచేలా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని వారు ఆరోపించారు. ఆర్టికల్ 19, 21 ప్రకారం రాజ్యాంగం ఇచ్చిన గోప్యత, భావప్రకటనా స్వేచ్ఛ హక్కు ప్రజలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పులిచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన పలు సంఘటనల పట్ల తమ పౌర సంఘాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని వారు సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. డీఎస్పీ ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలోని ఎస్ఐబీ బృందం తాము ఫోన్ ట్యాపింగ్ చేశామని నేరాన్ని ఒప్పుకొని వాంగ్మూలం ఇచ్చారు.

**నిఘాతో స్వేచ్ఛను హరించారు...**

విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, బీఆర్ఎస్ వ్యతిరేకులు, పార్టీ నాయకుల వ్యక్తిగత జీవితాలు, వారి కార్యకలాపాలపై ఫోన్ ట్యాపింగ్ ద్వారా నిఘా పెట్టారని ఫోరం సభ్యులు తెలిపారు. తెలంగాణ పోలీసు వ్యవస్థను ఆధునీకరించి నిఘా పరికరాలతో ప్రజల స్వేచ్ఛను హరించారని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

**ట్యాపింగ్ పై హైకోర్టు సుమోటో విచారణ**

పోలీసులు ప్రతి పక్ష నేతలపై నిఘా వేయడమే కాకుండా సీనియర్ రాజకీయ నాయకులు, న్యాయవ్యవస్థ సభ్యులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కూడా సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేస్తుందని వారు తెలిపారు.



**సీఎం దృష్టికి ప్రజాసంఘాల కీలక అంశాలు**

- తెలంగాణలో మానవ హక్కుల ఉల్లంఘనలు, ఫోన్ ట్యాపింగ్ పై రిటైర్డు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరపాలి.
- తెలంగాణ రాష్ట్రంలో పోలీసింగ్ పద్ధతులు, ఇంటెలిజెన్స్ కార్యకలాపాలపై అన్ని వివరాలతో పోలీసు మాన్యవల్ ప్రచురించాలని కోరారు.
- ఫోన్ ట్యాపింగ్ కేసులు, అక్రమ నిఘా సమస్యలు, పోలీసింగ్ పద్ధతులు, మానవ హక్కుల ఉల్లంఘనలపై సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి లేదా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఉన్నత స్థాయి విచారణ కమిషన్ నియమించాలని కోరారు.
- గూఢచార కార్యకలాపాలను శాసన పర్యవేక్షణలోకి తీసుకువచ్చి, దీనిలో దుర్వినియోగాన్ని అరికట్టాలి.
- మెదక్ పట్టణంలో పోలీసు కస్టడీలో మరణించిన మహమ్మద్ ఖదీర్ ఖాన్ ఘటనలో హింసకు పాల్పడిన పోలీసులపై విచారణ జరపాలని కోరారు. మృతుడు ఖదీర్ ఖాన్ భార్య సిద్ధేశ్వరి అలియాస్ ఫర్జానా, వారిపై ఆధారపడిన వారికి ఆర్థిక సహాయాన్ని అందించాలని మేధావులు కోరారు.
- తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పోలీసు ఫిర్యాదుల అథారిటీని పనిచేసేలా చేయాలి.
- రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, సమాచార హక్కు చట్టం కిద దరఖాస్తు చేసిన వారికి సీసీటీవీ ఫుటేజీ ఇవ్వాలని కోరారు. సుప్రీం ఆదేశాల మేర కస్టడీ హింసను నిరోధించాలని వారు డిమాండ్ చేశారు.
- శాంతియుతంగా నిరసనల్లో పాల్గొన్న వ్యక్తులపై తాత్కాలిక నిర్బంధాన్ని విధించొద్దు
- 2019 డిసెంబరు 6వతేదీన నలుగురు నిందితులు ఆరిఫ్, జాలీ నవీన్, జొల్లి శివ, చింతకుంట చెన్న కేశవులను హతమార్చడంపై జస్టిస్ సిర్పూర్ కర్ ఇచ్చిన నివేదికపై పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి.
- జంతువుల విక్రయదారులపై పోలీసుల వేధింపులను ఆపాలి.
- తెలంగాణలో అట్టడుగు వర్గాలు నివసిస్తున్న ప్రాంతాల వ్యక్తుల గౌరవం, గోప్యతను ఉల్లంఘించే కార్డన్ సెర్చ్ కార్యకలాపాలను పోలీసులు నిలిపివేయాలి. కార్డన్ సెర్చ్ లో వాహనాలను స్వాధీనం చేసుకోవద్దు.
- పోలీసులు వారెంట్లను డిజిటలైజ్ చేసి వాటిని బహిరంగంగా అప్ లోడ్ చేయాలని సూచించారు.
- పాతబస్తీలో మిషన్ చబుత్రా పేరిట యువకులను లక్ష్యంగా చేసుకొని వారిపై పోలీసింగ్ ను ఆపాలని కోరారు.
- చిన్న కేసుల్లో పారదర్శకంగా విచారణ జరిపి, అందులో నిందితులకు న్యాయ సహాయం అందించాలి.
- దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలు, సెక్స్ వర్కర్లు, మైనారిటీలు, బలహీనవర్గాల హక్కులను కాపాడాలి.

**25 ప్రజా సంఘాల యాక్టివిస్టులు కలిసి...**

ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక తరపున 25 మంది సోషల్ యాక్టివిస్టులో సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖ రాసిన వారిలో రమా మెల్కోటే (రిటైర్డ్ అకడమిక్, ఉస్మానియా యూనివర్సిటీ),జీవన్ కుమార్ (మానవ హక్కుల వేదిక, తెలంగాణ)కె. సజయ (మహిళలు & లింగమార్పిడి సంస్థల జేఏసీ),మీరా సంఘమిత్ర (నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ ),మసూద్ (సామాజిక కార్యకర్త),శంకర్ (నేషనల్ ఫోరమ్ ఫర్ అర్బన్ స్ట్రగుల్స్ - తెలంగాణ),ఖలీదా ప్రవీణ్ (సామాజిక కార్యకర్త),షేక్ సలావుద్దీన్ (తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు),రోహిత్ (మానవ హక్కుల వేదిక, తెలంగాణ),రుచిత్ ఆశా కమల్ (క్లైమేట్ ఫ్రంట్ హైదరాబాద్),జాన్ మైఖేల్, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టర్స్ కలెక్టివ్ ,వర్ష (వేర్ ఆర్ ది విమెన్, తెలంగాణ),నికితా నాయుడు (క్లైమేట్ యాక్షన్),శ్రీహర్ష టి (రైతు స్వరాజ్య వేదిక),సయ్యద్ ఫిరోజ్ (నిరాశ్రయ శ్రామిక సంఘటన్),అంబటి నాగయ్య (తెలంగాణ విద్యావంతుల వేదిక),కృష్ణ (తెలంగాణ విద్యావంతుల వేదిక),కనీజ్ ఫాతిమా (పౌర హక్కుల కార్యకర్త),ఎస్.సీతాలక్ష్మి (స్వతంత్ర పరిశోధకురాలు),శ్రీనివాస్ కొడాలి (స్వతంత్ర పరిశోధకుడు),కుద్సియా తబస్సుమ్ (న్యాయవాది & సామాజిక కార్యకర్త),ఎస్ ఆశాలత (రైతు స్వరాజ్య వేదిక & మకం), షకీల్ (అడ్వకేట్ & సామాజిక కార్యకర్త),నటాషా రామరత్నం (డెవలప్‌మెంట్ కన్సల్టెంట్, హైదరాబాద్),సౌమ్య కిదాంబి (స్వతంత్ర పరిశోధకురాలు)లు ఉన్నారు.

## ఐటీఐలకు మహార్దశ

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దాలని సీఎం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఏటీసీలకు రేవంత్ రెడ్డి మంగళవారం మల్లేపల్లి ఐటీఐలో శంకుస్థాపన చేశారు.

**ఐటీసీలకు సంబంధించిన ముఖ్య అంశాలు..**

65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుంది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక (షార్ట్ టర్మ్) కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74) ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి.

## బీఆర్‌ఎస్‌వి ఉల్లంఘనలే..

(మొదటి పేజీ తరువాయి)

'రాష్ట్రానికి ఛత్తీస్‌గఢ్ సరిగా విద్యుత్ సరఫరా చేయలేదు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు వల్ల రూ.2 వేల కోట్లు అదనపు భారం పడింది. ఛత్తీస్‌గఢ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ డిస్కంలతో రాష్ట్ర డిస్కంలు పీపీఏ చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న పీపీఏకు ఇంతవరకు ఆమోదం లభించలేదు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు. కాంపిటేటివ్ బిడ్డింగ్ ద్వారా వెళ్తే ఆలస్యం అవుతుందని నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్‌కు ఇచ్చారని' విద్యుత్ అధికారి రఘు అన్నారు.

**విద్యుత్ సంస్థలకు రూ.81 వేల కోట్లు నష్టం :**

గత ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలను సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. చట్టం ప్రకారం అందరూ నడుచుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించాలన్నారు. అభివృద్ధి అంటే ఒకరిద్దరికీ లాభం చేయడం కాదని స్పష్టం చేశారు. కేంద్రం తక్కువ ధరకే విద్యుత్ సరఫరా చేస్తామన్న బేఖాతరు చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వం తొందరపాటు వల్ల ట్రాన్స్‌కో, జెన్‌కోకు రూ.81 వేల కోట్లు అప్పులయ్యాయని ఆరోపించారు. గతేడాది వచ్చిన వరదలకు భద్రాద్రి ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ఆపేయాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. భవిష్యత్‌లో గోదావరి వద్ద నీటిమట్టం పెరిగితే భద్రాద్రి ప్లాంట్‌ను కాపాడుకోగలమా అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వం కొద్ది మందికి లాభం చేసేందుకు యత్నించిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల సాధారణ ప్రజానికానికి ఇబ్బందులు తప్పలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందని ఘాటుగా వ్యాఖ్యానించారు. వారు చేసిన తప్పిదాలపై క్రిమినల్ చర్యలకు కూడా వెనకాడవద్దని ప్రొఫెసర్ కోదండరాం చెప్పారు.

## హైదరాబాద్‌ను న్యూయార్క్ నగరంలా తీర్చిదిద్దాలి

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌ను న్యూయార్క్ నగరంలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని హైదరాబాద్‌ను ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో ఒకటిగా నిలబెట్టాలనేది తమ సంకల్పమని సీఎం అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు మార్గాల విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారు కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మాథ్యూ భౌ బృందం భేటీ అయింది.హైదరాబాద్ గ్లోబల్ సిటీగా అభివృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్న విధానంపై సమావేశంలో చర్చ జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ దేశంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తమ అధ్యయనంలో తేలిందని కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం వివరించింది. గడిచిన ఆరు నెలల్లో రియల్టీతో పాటు లీజింగ్ , ఆఫీసు స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ సిటీ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందని ఆ సంస్థ పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ఆరు నెలలకోసారి వెల్లడించే తమ నివేదిక జులై నెలాఖరులో వెలువడుతుందని పేర్కొంది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం...

**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యుత్ విచారణ కమిషన్‌పై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు . విచారణ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌పై అనవసర ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. విచారణ కమిషన్ పారదర్శకంగా విచారణ చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోంది అని ఫైర్ అయ్యారు. ప్రజాధనం దుర్వినియోగం జరగలేదు.. ఒప్పందాల మేరకే ప్రాజెక్టులు జరిగాయని కేసీఆర్ లేఖ రూపంలో పేర్కొన్నారు. నియమాలకు విరుద్ధంగా కమిషన్ వ్యవహరిస్తుంది. కమిషన్ న్యాయ బద్ధంగా విచారణ చేయాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా వివక్ష లేకుండా పారదర్శకంగా విచారణ చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ ఇచ్చాం. బండి సంజయ్‌కు కనీస పరిజ్ఞానం లేదు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ ఒక్కటే. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని 5 సంవత్సరాల నుంచి చెబుతున్నాం" అని జగదీష్‌రెడ్డి అన్నారు.

## నంబర్ కోసం @రూ. 12, 25, 000

(మొదటి పేజీ తరువాయి)

సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు తమకు నచ్చిన నంబర్ ప్లేట్ల కోసం లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రంలో కూడా వాహన రిజిస్ట్రేషన్ ఫ్యాన్సీ నంబర్లకు గిరాకీ భారీగా పెరిగింది. కేవలం ఒక్క వాహనం రిజిస్ట్రేషన్ కోసం లక్షల్లో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. తాజాగా అలాగే తనకు నచ్చిన నెంబర్ కోసం ఏకంగా లక్షల్లో ఖర్చు చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సామల వెంకట్ రెడ్డి అనే వ్యక్తి 'TG 33 3333' నెంబర్ కోసం రూ. 12,25,000 ఖర్చు చేశారు. రిజిస్ట్రేషన్ నెంబర్ TG 33 3333 ను ఆయనకు కేటాయించింది. ఇక వెంకట్ రెడ్డి సామల వాహనం నంబర్‌ను రిజర్వ్ చేసిన పదిహేను రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్దేశించారు. లేని పక్షంలో (టీఎస్ఎంఎల్) 1989లోని రూల్ 81(6) ప్రకారం ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా రిజర్వ్ చేయబడిన నంబర్ రద్దు చేయబడుతుంది. రిజిస్టరింగ్ అథారిటీ ఆర్‌టీఏ ఉత్తర్వులు జారీ చేసింది.

# యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ ప్రారంభం



**విశ్వంభర, యాదాద్రి :** మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తులకు దేవస్థానం గుడ్ న్యూస్ చెప్పింది. అరుణాచలం, సింహాచలం తరహాలో గిరి ప్రదక్షిణ సేవను యాదగిరిగుట్ట దేవస్థానం అందుబాటులోకి తీసుకువచ్చింది. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున గిరి ప్రదక్షణకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. యాదగిరిగుట్ట కొండపై జ్వాలా నారసింహుడు, గండభేరుండ నారసింహుడు, యోగ నారసింహుడు, ఉగ్ర నరసింహుడు, లక్ష్మీ నరసింహుడు స్వయంభువులుగా వెలసిన పంచ నారసింహక్షేత్రంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో ఏళ్లుగా స్థానిక భక్తులు మాత్రమే గిరిప్రదక్షిణ చేసుకొని స్వామి వారిని దర్శించుకోవడం జరుగుతోంది. అయితే 2016లో కోట్లాది రూపాయలతో ఆలయాన్ని పునఃర్నిర్మించారు. దీంతో గిరి ప్రదక్షణ చేసేందుకు భక్తులకు ఇబ్బందికరంగా మారింది.

**నాలుగు వేల మంది భక్తులతో గిరి ప్రదక్షిణకు శ్రీకారం..**

అరుణాచలంతోపాటు తెలుగు రాష్ట్రంలోని సింహాచలం, శ్రీకాళహస్తి, ఇంద్రకీలాద్రి క్షేత్రాల్లో మాత్రమే గిరిప్రదక్షిణలు కొనసాగుతున్నాయి. యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ స్వామివారికి ఇప్పటివరకు స్థానిక భక్తులే గిరి ప్రదక్షిణ చేస్తున్నారు. ఇక నుంచి అరుణాచలం, సింహాచలం తరహాలో భక్తులందరికీ గిరి ప్రదక్షిణ అవకాశాన్ని కల్పించాలని యాదగిరిగుట్ట అధికారులు సంకల్పించారు. స్వామి వారి ఆలయం చుట్టూ ఐదున్నర కిలోమీటర్ల మేరకు భక్తులకు ఇబ్బంది కలగకుండా వీధిని ఏర్పాటు చేశారు. పాంచ నర్సింహుడి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజు నేడు నాలుగు వేల మందితో గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభమైన గిరిప్రదక్షిణ.. తిరిగి వైకుంఠ ద్వారం వద్దకు చేరుకొని మెట్ల మార్గంలో ఆలయానికి వెళ్లి ఉచితంగా స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ గిరి ప్రదక్షిణలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో భాస్కరరావు, సిబ్బంది 5000 మంది భక్తులు పాల్గొన్నారు.

**రాష్ట్రంలో తొలి గిరి ప్రదక్షణ ఆలయంగా రికార్డు..**

గిరి ప్రదక్షిణ చేయడం ద్వారా పాపాలు నశించి మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కూడా గిరిప్రదక్షణతో ఆలయానికి మరింత శోభ వచ్చింది. అరుణాచలం గిరి ప్రదక్షిణ 14కిలోమీటర్లు ఉండగా, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ ఐదున్నర కిలోమీటర్లు ఉంటుంది. గిరి ప్రదక్షిణలో భక్తుల సంకీర్తనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయితే "గిరి ప్రదక్షిణ"ను ప్రవేశపెట్టిన తెలంగాణలో మొట్టమొదటి ఆలయంగా యాదాద్రి దేవస్థానం నిలవనుంది. క్షేత్రంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు సేవలను అందుబాటులో తీసుకువచ్చే క్రమంలో భాగంగానే గిరి ప్రదక్షణకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు. యాదాద్రి కొండపై భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గిరి ప్రదక్షణతో యాదాద్రి క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని వారు చెప్పారు.

## కమలం గూటికి గంగుల?

(మొదటి పేజీ తరువాయి)



ఉన్నాయి. అయితే, ఇటీవల బండి సంజయ్ కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి దక్కడంతో సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే గంగుల శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పార్టీ మార్పు ప్రచారానికి ఊతమిచ్చినట్లు అయ్యింది. ఈ పోస్టును ఎవరికి తోచినట్లు వారు అన్వయించుకుంటున్నారు. గంగుల మాత్రం నో కామెంట్ అన్నట్లుగా మౌనం వహిస్తున్నారు.

**హస్తం గూటికి చేరతారనే ప్రచారం**

మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి, గంగుల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీలో ఇద్దరూ కలిసి పనిచేశారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాలో చెరోగూటికి చేరారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక గంగుల జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్.. గంగుల కమలాకర్ రాకకు అడ్డు చెప్పినట్లుగా మరో టాక్ వినిపించింది. అయితే, కరీంనగర్ పర్యటనలో గంగుల కమలాకర్ ఇంటికి వెళ్లిన కేసీఆర్, కేటీఆర్.. పార్టీ మారకుండా గంగులకు నచ్చ చెప్పినట్లుగా తెలుస్తోంది. గంగుల కూడా పార్టీ మారటం లేదనే స్పష్టతనివ్వడంతో కొన్నిరోజుల పాటు జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. ప్రస్తుతం బీజేపీ పుంజుకోవడంతో కరీంనగర్ లో బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవి దక్కించుకోవడంతో గంగుల కమలాకర్ పంతాలు పక్కన పెట్టి బండి సంజయ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కాషాయ కండువా కప్పుకోవడానికి ముహూర్తం ఫిక్స్ అయ్యే పోస్టు పెట్టి ఉంటారనే టాక్ నడుస్తోంది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేను రానీవొద్దు...

**విశ్వంభర, నాగర్ కర్నూల్:** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేను మన పార్టీకి రానీవొద్దంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. తాజాగా గద్వాలలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్ లో చేర్చుకోవద్దంటూ సొంత పార్టీ నాయకులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కాంగ్రెస్ గూటికి గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి వెళ్తున్నారు అనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ క్యాడర్ అలెర్ట్ అయింది. నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి ఇంటికి వెళ్ళిన గద్వాల కాంగ్రెస్ ఇంఛార్జి సరిత తిరుపతయ్య.. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవదంట్టూ కన్నీళ్ళు పెట్టుకున్న సరిత... బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేరుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారట.

